RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 113 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 27.10.2026 | పేజీలు : 8

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



2

తెలంగాణలో వడ్లకు రికార్డు ధర..

క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు!

- తెలంగాణలో వడ్లకు రికార్డు స్థాయిలో ధరలు
- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాలు జై శ్రీరామ్ వడ్లు రూ. 5,016
- సాగు తగ్గడం, పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడమే కారణం
- ప్రభుత్వ మద్దతు ధరను మించిపోవడంతో పౌరసరఫరాల శాఖకు సవాల్
- రిటైల్ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 100కు చేరిక



2

'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'..

సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫైర్!

- సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
- 30 వేల మంది‌తో దీక్షకు సిద్ధమని ప్రకటన
- మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న
- సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని వెల్లడి



2

తుమ్మిడిహెట్టిపై తెలంగాణ ప్రతిపాదనకు
ఫడ్నవీస్ సానుకూలం..!



- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ


నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సా ధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది..

2

తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'..

- ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!

- ఎల్లుండి బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో గాలులు
- కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- ప్రజల కోసం విపత్తుల నిర్వహణ సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు జారీ



నిత్యం నిఘా, హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. ఇది వేగంగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోందని, దీని ప్రభావం రాష్ట్రంపై గణనీయంగా ఉండనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ తుపాను రానున్న 12 గంటల్లో అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను, గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా పయనిస్తోంది. ఇది విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు చెరో 490 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 560 కి.మీ, మచిలీపట్నంకు 660 కి.మీ, బాపట్లకు 730 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు సాయంత్రం వరకు పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి, ఆ తర్వాత వాయువ్య దిశగా మలుపు తీసుకుంటుందని అంచనా వేశారు. ఎల్లుండి (బుధవారం) ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఈ తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గాలి వేగం గంటకు 115-125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరే సూచనలు ఉన్నాయని హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి విస్తారంగా వర్షాలు...

2

హీరోయిన్లతో కేటీఆర్ దుబాయ్ వెళ్లారు : వెంకట్ బల్మూర్

- 'రామ్ కేటీ', 'కే రామ్' పేర్లతో ప్రయాణించారని ఆరోపణ
- కొడుకుపై ఒట్టేసి చెప్పాలని కేటీఆర్‌కు సవాల్
- కేసీఆర్, జగన్ భేటీపైనా పాత విషయాల ప్రస్తావన



2

కరువు తెచ్చి.. వరి వద్దంటరా?

- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయరు
- కృష్ణకు వదిలి కరువు అంటున్నరు
- రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది
- ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలే
- ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి మద్దతు

నిత్యం నిఘా, రాజన్న సిరిసిల్ల : గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్రంపైకి కరువును తెచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వరి వేయ వద్దంటూ రైతులకు సుద్దులు చెప్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని, అన్ని వర్గాలనూ మోసం చేసిండని దుయ్యబట్టారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం అసెంబ్లీలో నిలదీస్తామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ సోమవారం పర్యటించారు. మొదట గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి .....




2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'..

- ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!



మొదటిపేజీ తరువాయి.. పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. తుపాను నేపథ్యంలో రేపు కోస్తా తీరం వెంబడి గంటకు 90-100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు చెట్లు, భారీ హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండరాదని సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ 112, 1070, 1800 425 0101 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కరువు తెచ్చి.. వరి వద్దంటరా?



మొదటిపేజీ తరువాయి.. అనంతరం తెలంగాణ భవన్‌లో కుప్పం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కలిశారు. తాము 14 రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఇది మూర్ఖపు ప్రభుత్వమని, మీకిచ్చిన హామీలు అమలు చేస్తాడని నమ్మకం లేదన్నారు. మరో ఏడాదిన్నర ఓపిక పడితే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఉద్యోగులకు ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని, మూడేండ్లలో ఏడు డీఏలు బాకీ ఉన్నాడని మండిపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందికి కృష్ణకు గోదావరి నీళ్లు వదిలిపెట్టి ఇప్పుడు కరువు అంటూ కథలు చెప్తున్నాడని విమర్శించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కట్టిందే నీళ్ల కోసమని, దానిని మూడేండ్లుగా బదనాం చేసి నీళ్లు ఎత్తిపోయడం లేదని అన్నారు. రాబోయే ప్రభుత్వం అన్ని వర్గాలకు, ఉద్యోగులకు కావాల్సిన అవసరాలను అడగకుండా తెలుసుకొని అమలు చేస్తుందని చెప్పారు. ఒక్క సంవత్సరం ఓపిక పట్టాలని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు ఉన్నదని ముఖ్యమంత్రే చెప్తున్నారని, మళ్లీ మూసీ సుందరీకరణ అంటూ సోకులు పడడానికి వేల కోట్ల రూపాయలకు టెండర్లు పిలుస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి పేదలు, చిరుద్యోగులు, వాళ్లకు ఇచ్చిన హామీలపై పట్టింపు, సోయి లేదని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూర్చగా.. సోమవారం వాటిని ఆయన ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎగదండి మేఘనకు మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మేఘన ఆహారం కూడా తీసుకోలేని స్థితికి చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన గుగులోత్ జశ్వంత్‌కు కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కేటీఆర్ పర్యటనలో అభిమానులు 'సీఎం.. సీఎం' అనే నినాదాలతో హోరెత్తించారు. సోమవారం ఆయన సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సమయంలో అక్కడున్న వారంతా 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎదురుపడగా.. కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం.. సీఎం నినా దాలు మరింతగా మార్మోగాయి. గంభీరావుపేట మండలం లింగన్నపేట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లోనూ కేటీఆర్ పాల్గొనగా.. 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలతో స్వాగతం పలికారు

తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్

తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం..!

మొదటిపేజీ తరువాయి.. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయ నం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

తెలంగాణలో వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్‌కు రూ. 5,000 దాటిన రేటు..!

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది. "వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'..

సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫైర్!

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో సొంత ప్రభుత్వంపైనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చస్తే గానీ బిల్లులు చెల్లించరా? అంటూ ప్రశ్నించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపాట్లపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సచివాలయం తీరుపై అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం తాను చనిపోతేనే నిధులు విడుదల చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం నిలబడుతుందని అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా వెళతానని చెప్పారు. తన నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

హీరోయిన్లతో కేటీఆర్ దుబాయ్ వెళ్లారు : వెంకట్ బల్మూర్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ తీవ్రమైన వ్యక్తిగత ఆరోపణలు చేశారు. కేటీఆర్ తన పేరును మార్చుకుని ఇద్దరు హీరోయిన్లతో కలిసి దుబాయ్ వెళ్లారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. 'రామ్ కేటీ', 'కే రామ్' అనే పేర్లతో కేటీఆర్ ఇద్దరు హీరోయిన్లు, మరో ఇద్దరు ప్రముఖులతో కలిసి దుబాయ్‌కు వెళ్లారని ఆరోపించారు. ఎవరికీ దొరక్కుండా ఉండేందుకే హైదరాబాద్ నుంచి నేరుగా కాకుండా, బెంగళూరు, ఢిల్లీ మీదుగా ప్రయాణించారని పేర్కొన్నారు. తాను చెబుతున్నవి అబద్ధమైతే, తన కొడుకు మీద ఒట్టేసి చెప్పగలరా అని కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. కేటీఆర్ ఒక రాక్షసుడని, ఆయన వల్ల మహిళలకు ప్రమాదమని, ఆయన భయంతోనే టాలీవుడ్ నిర్మాతలు, దర్శకులు తెలంగాణలో సినిమాలు తీయలేకపోతున్నారని వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా విమర్శించారు. గతంలో వైసీపీ అధినేత జగన్ తో కేసీఆర్ ఎందుకు చర్చలు జరిపారని, వైసీపీ నేత రోజా ఇంట్లో రొయ్యల కూర ఎందుకు తిన్నారని పాత విషయాలను కూడా ప్రస్తావించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దీపావళి బాణాసంచా విక్రయాలకు నవంబర్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలి

- **తాత్కాలిక విక్రయ కేంద్రాలకు అనుమతులు తప్పనిసరి**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**



వరంగల్, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): రానున్న దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునే వారు అనుమతుల కోసం నవంబర్ 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తులను సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు.దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర పత్రం, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, వస్తు సేవల పన్ను నమోదు ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో లైసెన్స్ పొందిన వారు దాని ప్రతిని జతచేయాలి. అవసరమైన చోట్ల పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలతో పాటు స్థలానికి సంబంధించిన నమూనా పటాన్ని కూడా అందించాలి. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించినట్లు తెలిపే బ్యాంకు చలాన్‌ను దరఖాస్తుకు జతచేయాలని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. వ్యాపారులు గడువులోగా దరఖాస్తు చేసుకుని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- **303 అర్జీలు స్వీకరణ.. వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశం**
- **ఉద్యోగులకు ముఖ గుర్తింపు హాజరు.. పట్టభద్రుల ఓటరు నమోదుపై సూచనలు**





హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 303 అర్జీలు అందాయి. వీటిలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 150, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో 16, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో 137 అర్జీలను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖలో ఉద్యోగులకు 'మీ ప్రమాణం' యాప్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఉద్యోగులు కార్యాలయ పరిధిలోనే తమ మొబైల్ ఫోన్ల ద్వారా రోజువారీ హాజరును నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అర్హులైన ప్రతి ఉద్యోగి పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే జిల్లాలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న భూముల పునఃసర్వే ప్రక్రియలో భాగంగా సాగునీటి పారుదల, పంచాయతీరాజ్‌తో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూముల రికార్డులు, వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి, పునఃసర్వే ద్వారా ధ్రువీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నరకాసుర వధ ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు

- **నవంబర్ 6న ఉర్సుగుట్ట మైదానంలో వేడుకలుభద్రతా ఏర్పాట్లు చేస్తాం: సెంట్రల్ జోన్ డీసీపీ తారా కవిత**



హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6న ఉర్సుగుట్టలోని మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ ఉత్సవాలకు శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ తారా కవిత తెలిపారు. సోమవారం హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్‌లో నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు డీసీపీ తారా కవితను కలిసి పూల మొక్కను అందజేశారు. ఉత్సవాలకు ఆహ్వాన పత్రికతో పాటు వినతిపత్రాన్ని సమర్పించి, కార్యక్రమ వివరాలను ఆమెకు తెలియజేశారు. నవంబర్ 6న సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, రాత్రి 8.45 గంటలకు నరకాసురుడి ప్రతిమకు బాణాసంచా అమర్చి దహన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి వివరించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి, వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు కొండా సురేఖ, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు వేలాది మంది ప్రజలు హాజరుకానున్నట్లు తెలిపారు.భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిటీ ప్రతినిధులు డీసీపీని కోరారు. దీనిపై స్పందించిన ఆమె, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతం, దూడే బాల, కొమురెల్లి, వనం కుమార్, కాటం సతీష్, కుండే రాజు, గౌడ కోటేశ్వర్, బలభద్ర, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకంపల్లిలో ఘనంగా మెగా వైద్య శిబిరం

- **గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు.. సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ**



ములుగు జిల్లా, అక్టోబర్ 26(నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ములుగు జిల్లా తాడ్వాయి మండలం అంకంపల్లి గ్రామంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సేవా భారతి ఆసుపత్రి, హైదరాబాద్ వారి సహకారంతో పాటు వనవాసి కళ్యాణ్ పరిషత్, సేవంకూర్ భారత్ సంస్థల భాగస్వామ్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో వైద్య బృందం గ్రామ ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలను అందించింది. వైద్యులు, మహిళా వైద్యులు, పురుష వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సేవా భారతి సంస్థ ఆధ్వర్యంలో బాలికల విద్యాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధి, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన వంటి పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. అలాగే సేవంకూర్ భారత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బహుళ వైద్య విభాగాల ఆసుపత్రులను నిర్వహించడంతో పాటు వైద్య, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇర్ప వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ విజయకాంత్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రోజా, వనవాసి కళ్యాణ్ పరిషత్ ములుగు జిల్లా వైద్య శిబిరం ఇన్‌చార్జి బండారి జగదీష్, కార్యదర్శి ఇర్ప నాగేశ్వరరావు, వైద్య బృందం సభ్యులు, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమకొండలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- **ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలికలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కొనియాడారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌తో పాటు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి బోధించిన ధర్మమార్గం, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో పయనిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా కొమరం భీమ్ 86వ వర్ధంతి

- **ఆదివాసీల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయంకేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం**



హనుమకొండ / కేయూ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆదివాసీల హక్కుల సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ అని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం కొనియాడారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాం పాలనలో సాగిన అణచివేతకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటం, ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.కొమరం భీమ్ ఇచ్చిన 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి) నినాదం ఆదివాసీల హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిందని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ నినాదం ప్రకృతి వనరులపై ప్రజల హక్కులతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని కూడా గుర్తుచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం



జనగామ జిల్లా, రఘునాథపల్లి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మా గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రఘునాథపల్లి ఎస్‌హెచ్‌ఓ మోదుగు భరత్ పిలుపు మేరకు కోమల్ల గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు శిబిరానికి హాజరై రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రక్తదానం చేసిన నాయకులకు ఎస్ఐ భరత్ రక్తదాన ధ్రువపత్రాలను అందజేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం చేయడం ఎంతో గొప్ప సేవ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్న కోమల్ల గ్రామ నాయకులను పలువురు అభినందించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి



హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ డిమాండ్ చేశారు. అక్టోబర్ 31న నిర్వహించనున్న ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను దెబ్బతీసేలా నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చిందని విమర్శించారు. వీటి ద్వారా కార్మిక సంఘాలను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే విధానాలతో కార్మికులపై శ్రమభారం మోపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న జరిగే ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రాంమూర్తి, ఉపాధ్యక్షులు బత్తిని సదానందం, ఎన్.ఏ. స్టాలిన్, లంకదాసరి అశోక్, ఆలకుంట యాకయ్య, సహాయ కార్యదర్శులు మాలోత్ శంకర్, గుంటీ రాజేందర్, ఆలకుంట మల్లయ్య, కుడిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీపై వ్యాసరచన పోటీలు



ఏటూరునాగారం, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ (మత్తు పదార్థాల నిర్మూలన), సైబర్ సెక్యూరిటీ (డిజిటల్ భద్రత) అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. వ్యక్తిగత సమాచారం, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలని పేర్కొన్నారు.దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె ఉద్ఘాటించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ, మత్తు పదార్థాల నిర్మూలనకు మరియు సైబర్ నేరాల నివారణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సీహెచ్. వెంకటయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ నవీన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, అధ్యాపకులు జీవవేణి, శ్రీధర్, రమేష్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాపురి 4వ వార్డులో డ్రైనేజీ శుభ్రత పనులు



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి 4వ వార్డులో డ్రైనేజీ శుభ్రత పనులు చేపట్టారు. ఆదివారం కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. వార్డులో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, మురుగు కాలువల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా డ్రైనేజీ శుభ్రత పనులకు సహకరించిన మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డికి కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.వార్డులో పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడంతో పాటు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

ములుగు జిల్లా/ తాడ్వాయి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):రానున్న వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని తాడ్వాయి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, కాటాపూర్ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు అన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.తాడ్వాయి మండల పరిధిలోని కాటాపూర్ గ్రామంలో దిడ్డి మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన వారు అవసరమైన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ లేదా ప్రొవిజినల్ సర్టిఫికెట్, మార్కుల మెమో, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోహన్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే కరెంటు కష్టాలు తప్పవని గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితులు ఆ వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు.రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలోనూ ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందని ఆయన ఆరోపించారు. హైడ్రా పేరుతో ఇళ్ల కూల్చివేతలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. కొత్తగా తీసుకొచ్చిన 22-ఏ నిబంధనల ద్వారా పేదల భూములకు ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందని



అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా అర్హులైన రైతులకు పట్టాలు అందించామని, పోడు భూములకు సైతం పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూభారతి పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో ఇసుక దందా కొనసాగుతోందని విమర్శించారు.పట్టభద్రులు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి, ఆలోచించి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని దిడ్డి మోహన్‌రావు కోరారు.

మంథనిలో నవంబర్ 1న గణపతి సచ్చిదానంద స్వామీజీ పాదపూజ మహోత్సవం

పెద్దపల్లి జిల్లా/మంథని, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలో అవధూత దత్త పీఠాధిపతి పరమపూజ్య గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య సన్నిధిలో పాదపూజ మహోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు హాజరుకానున్నారు.ధన్వాడ, మంథని ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామీజీ ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భక్తి మార్గాన్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు సమాజంలో శాంతి, సంతోషం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. మంథని మున్సిపాలిటీ పరిధిలోని కేకే గార్డెన్స్‌లో మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖుల కోసం హెలీప్యాడ్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమానికి మంథని మున్సిపల్ చైర్మన్ పోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్‌రెడ్డి, కౌన్సిలర్ పెంటరి రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



అయిలీ ప్రసాద్, బీహెచ్ఈఎల్ ఆశ్రమం అవధూత దత్త పీఠం ట్రస్టీ రాజవరం సచిన్న, దుద్దిళ్ల గణపతి, శశి భూషణ్ కాచే, శ్రీరామ్ భట్ల శ్రీనివాస్, ఆరేల్లి కిరణ్‌కుమార్ గౌడ్ తదితరులు భక్తులు హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఎల్కతుర్తి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థులు బాల్య వివాహాల దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షేర్ ఎన్‌జీవో ప్రతినిధి జగన్ సూచించారు. ఎల్కతుర్తి మండలంలోని ఆల్టిట్యూడ్ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నివారణ, పోలీసుల సహాయం, హెల్ప్‌లైన్ సేవలు, ఆన్‌లైన్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. బాల్య వివాహం జరిగే అవకాశం ఉన్నా, అలాంటి ఘటనలు తెలిసినా వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆపద సమయంలో పోలీసులను ఎలా సంప్రదించాలి, హెల్ప్‌లైన్ నంబర్లను ఎలా వినియోగించుకోవాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. చదువుతోపాటు సామాజిక సమస్యలు, చట్టాలు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.



విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి స్నేహాలను అలవర్చుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సోషల్ మీడియా, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైతే దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించేందుకు పాఠశాల కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, ఉపాధ్యాయులు సురేష్, ఆశా, బేగం, సుమలత, మమత, లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు బాల్య వివాహాల నివారణ, హెల్ప్‌లైన్ సేవలు, పోలీసుల సహాయం, సైబర్ భద్రత, వ్యక్తిగత బాధ్యతలపై అవగాహన కల్పించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గుడుంబా మహమ్మారిని నిర్మూలించేందుకు సర్పంచ్ రవీందర్ ప్రత్యేక కార్యాచరణ

- **మహిళా సంఘాలు, గ్రామస్థులతో కలిసి గుడుంబా స్థావరాలపై దాడి**





ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామంలో గుడుంబా మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ నడుం బిగించారు. మహిళా సంఘాలు, గ్రామస్థులతో కలిసి ట్రాక్టర్‌పై గ్రామంలో పర్యటిస్తూ గుడుంబా తయారీ కేంద్రాలను సందర్శించారు. గుడుంబా తయారీకి ఉపయోగిస్తున్న డ్రమ్ములు, ప్లాస్టిక్ టిన్నులను ధ్వంసం చేసి, బెల్లం పానకాన్ని పారబోశారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడవద్దని సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ, పంటలు సరిగా పండక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను గుడుంబా మరింత కష్టాల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం గుడుంబా తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు.

గుడుంబాలో నాసిరకమైన, హానికరమైన పదార్థాలు కలపడం వల్ల యువత ఆరోగ్యం, భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.

ప్రభుత్వం రైతు భరోసా, ఆసరా పింఛన్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ, గుడుంబా వ్యసనం వల్ల ఆ డబ్బు తిరిగి మత్తు పదార్థాలకే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే పేద కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గుడుంబా నిర్మూలనకు ప్రజలంతా ఏకం కావాలి

గుడుంబా నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ మరింత చురుకుగా వ్యవహరించాలని రవీందర్ కోరారు. మహిళా సంఘాలు, కుల సంఘాలు, యువత, గ్రామస్థులు ఐక్యంగా ముందుకు వచ్చి గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను గ్రామస్థులే సమష్టిగా ఎదుర్కొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు.

గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేయడంతో పాటు రూ.50 వేల జరిమానా విధించేలా గ్రామపంచాయతీలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అయితే ఈ చర్యలు సంబంధిత చట్టాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గుడుంబా తయారీ, విక్రయాల సమాచారాన్ని అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, గ్రామస్థులతో గుడుంబా నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలల భద్రతకు పోక్సో చట్టంపై అవగాహన అవసరం



పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): బాలలపై లైంగిక నేరాలను నిరోధించి, వారికి చట్టపరమైన రక్షణ కల్పించే పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి దుర్గం గణేశ్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 26 నుంచి 31 వరకు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని, ఈ చట్టం ద్వారా బాలలకు లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు సోషల్ మీడియా వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పరిచయాలకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా ఇబ్బంది ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని అన్నారు. బాలికలకు ఏవైనా సమస్యలు తలెత్తితే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.బాలల హక్కులు, భద్రతపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాలలపై జరిగే నేరాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, పాఠశాల ప్రిన్సిపల్ దివాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఇత్తడి కళాకారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన





వరంగల్, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో ఖమ్మం రోడ్డులోని రంగశాయిపేట ఎంఎస్-సువిధా (M-Suwida) ఇత్తడి కళాకారుల క్లస్టర్ శిక్షణ కేంద్రంలో సోమవారం ఎంఎస్ఎంఈ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఎస్-సువిధా నాబార్డ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మండల పరశురాములు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. జీవన్ కుమార్ మాట్లాడుతూ, మహిళా ఇత్తడి కళాకారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ మంచి సిబిల్ (CIBIL) క్రెడిట్ స్కోర్‌ను కొనసాగించాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకొని తమ వృత్తిని అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) వంటి బీమా పథకాల ప్రయోజనాలను తెలుసుకొని వినియోగించుకోవాలని మహిళా సభ్యులకు సూచించారు.నాబార్డ్ వరంగల్ జిల్లా డీడీఎం తంగి చైతన్య రవి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు జీవనోపాధుల సుస్థిరతకు నాబార్డ్ సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళా కళాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు, మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. మార్కెట్ డిమాండ్‌ను గుర్తించి తమ సంప్రదాయ వృత్తిలో ముందుకు సాగాలని పేర్కొన్నారు.సమావేశంలో శంభునిపేట యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ నరేష్, సహాయ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎన్. విజయ్‌కుమార్, ఎంఎస్-సువిధా నాబార్డ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మండల పరశురాములు, సీఎఫ్ఎల్ ప్రతినిధులు భాస్కర్, టి. హేమవతి, ఎం. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.రంగశాయిపేట ఇత్తడి కళాకారుల క్లస్టర్‌కు చెందిన మహిళా సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని బ్యాంకు రుణాలు, ఆర్థిక నిర్వహణ, బీమా పథకాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన పొందారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతోపాటు తమ సంప్రదాయ ఇత్తడి చేతివృత్తిని మరింత అభివృద్ధి చేసుకోవడానికి ఇటువంటి సమావేశాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

బాలల హక్కులు, రక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- **విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి మల్లాడి అపర్ణ**



పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి భద్రతకు సంబంధించిన అంశాలను తెలియజేయాలనే ఉద్దేశంతో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంథనిలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంథని సీనియర్ సివిల్ జడ్జి మల్లాడి అపర్ణ విద్యార్థులకు పోక్సో చట్టం (లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం), బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలలు తమకు ఎదురయ్యే సమస్యలపై భయపడకుండా ధైర్యంగా స్పందించాలని, ఎవరైనా అన్యాయం చేసినా లేదా ఇబ్బందులకు గురిచేసినా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.బాలల భద్రత, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జడ్జి అపర్ణ వివరించారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గీట్ల భరత్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. రఘోత్తం రెడ్డి, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, గౌతమి శ్రీలక్ష్మి, వ్యాస్ కుమార్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని పంటల సాగు చేపట్టాలి



హనుమకొండ జిల్లా, దామెర, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగి సీజన్‌లో పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్ సూచించారు. సోమవారం దామెర గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' (సాగుభూమి సంరక్షణ కార్యక్రమం)లో ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. పున్నం చందర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో పంటల సాగుపై పడే అవకాశమున్న ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అధిక నీరు అవసరమయ్యే వరి సాగు వల్ల నష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు.

నీటి వసతి పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలతో పాటు వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ, నువ్వులు వంటి నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు. నేల స్వభావం, నీటి లభ్యత, స్థానిక వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అనుకూలమైన కూరగాయ పంటలను కూడా ఎంచుకోవచ్చని తెలిపారు.

కేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

రైతులకు కేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకునే మార్గాలపై అధికారులు అవగాహన కల్పించారు. నేల సారాన్ని కాపాడుకోవడం, భూసార సంరక్షణ పద్ధతులను పాటించడం, పర్యావరణహిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలను వివరించారు. ఆయిల్‌పామ్ సాగు విధానాలు, దానికి అనుకూలమైన పరిస్థితులపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంకని పద్మ చేరాలు, ఉపసర్పంచ్ మద్దె కుమారస్వామి, మార్కెట్ డైరెక్టర్ మంతుర్తి రాజయ్య, సొసైటీ డైరెక్టర్ మద్దె రాములు, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, రైతులు ఠాకూర్ రాంసింగ్, కడారి రాజేందర్, ఎడ్ల రవీందర్ రెడ్డి, బరీదుల రాజిరెడ్డి, మంతుర్తి సమ్మయ్య, చల్ల నరేందర్ రెడ్డి, ఆవుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన బడికి.. బస్సు ఎప్పుడొస్తుంది ఊరికి?

- చౌడారం గ్రామానికి బస్సు సర్వీసులు నడపాలి
- విద్యార్థుల ఇబ్బందులపై మాదిగ మేధావుల ఫోరం కోఆర్డినేటర్ యాసారపు కరుణాకర్ డిమాండ్



జనగామ జిల్లా, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సమయానికి పాఠశాలకు చేరుకోలేక కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండగా, మరికొందరు కాలినడకన బడికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఈ పాఠశాలకు వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాదిగ మేధావుల ఫోరం కోఆర్డినేటర్, మానవ హక్కుల స్వచ్ఛంద కార్యకర్త యాసారపు కరుణాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు కాలినడకన వెళ్లడం, మార్గమధ్యంలో ఇతర వాహనాలను ఆపి ప్రయాణించడం వంటి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనివల్ల సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారని, ఎక్కువ దూరం నడవడం వల్ల శారీరకంగా అలసిపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చౌడారం గ్రామానికి తగిన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రిన్సిపాల్, ఆర్టీసీ అధికారులు స్పందించాలి

విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యపై పాఠశాల ప్రిన్సిపాల్ చొరవ తీసుకుని ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించాలని కరుణాకర్ సూచించారు. పాఠశాల యాజమాన్యం, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

పేద విద్యార్థుల చదువుకు రవాణా సౌకర్యం అడ్డంకిగా మారకూడదని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. చౌడారం గ్రామానికి విద్యార్థులకు అనుకూలమైన వేళల్లో బస్సు సర్వీసులు నడిపించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని యాసారపు కరుణాకర్ హెచ్చరించారు.

నిరుపేదల జీవితాల్లో చూపు వెలుగులు

- బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు
- సరిహద్దు ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు 67 మంది తరలింపు







పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): నిరుపేదల జీవితాల్లో చూపు వెలుగులు నింపేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ విశేష సేవలందిస్తోంది. ఇందులో భాగంగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కంటి సమస్యలతో బాధపడుతున్న 67 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సల నిమిత్తం సోమవారం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని క్లబ్ అధ్యక్షుడు ఎం.ఏ. ముబీన్ వెల్లడించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు, కంటి వైద్య సేవల అధికారి బుద్దార్తి సతీష్ కుమార్ నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రయాణం నుంచి వైద్య పరీక్షల వరకు ఉచిత సేవల

కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో రోగులకు ఆధునిక ఫాకో పద్ధతిలో, చిన్న కోతతో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్సల కోసం వచ్చే రోగులకు ప్రయాణ ఖర్చులతో పాటు పోషకాహారం, శస్త్రచికిత్సకు ముందు అవసరమైన రక్త పరీక్షలను సైతం ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాన్ని క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కంటి వైద్య సేవల అధికారి, విజన్ శిబిరాల జిల్లా కమిటీ అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నిరుపేదలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాలకు చెందిన పేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించి, చూపు సమస్యల నుంచి ఉపశమనం కల్పించేందుకు కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ బృందానికి రోగులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి.

చింతలపల్లి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్ ఏకగ్రీవ ఎన్నిక

- విద్య, రాజకీయ చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యం



హనుమకొండ జిల్లా/ ఎల్కతుర్తి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం గ్రామ శాఖ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలమకంటి దయాకర్ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొర్రె థామస్, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొంకూరి రాజీవ్ గాంధీతో పాటు పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో సమూల మార్పు

ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల సదానందం మాట్లాడుతూ, సమాజంలో సమూల మార్పునకు విద్య పునాది అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఓటు హక్కు కీలకమైన సాధనమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ విద్యా, సామాజిక, రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు విద్యలో రాణిస్తూ అంబేద్కర్ ఆశయాలను అర్థం చేసుకోవాలని సూచించారు. విద్య ద్వారా తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని, సమాజంలో నెలకొన్న అసమానతలు, వివక్షను ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని సదానందం పేర్కొన్నారు. బహుజన వర్గాల ప్రజలు తమ ఓటు విలువను గుర్తించి, ఆలోచనాత్మకంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. భారత రాజ్యాంగం, పౌరుల హక్కులు, సామాజిక బాధ్యతలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని, విద్య, ఐక్యత, రాజకీయ చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నిక

మండల అధ్యక్షుడు బొంకూరి రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో చింతలపల్లి గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నూతన కమిటీ వివరాలు:
- అధ్యక్షుడు: చిలుముల ప్రమోద్
- ఉపాధ్యక్షుడు: బొంకూరి ప్రశాంత్
- ప్రధాన కార్యదర్శి: బొంకూరి చందు
- సహాయ కార్యదర్శులు: చుంచు రాకేష్, చిలుముల అరుణ్
- గౌరవ అధ్యక్షుడు: బొంకూరి సదానందం
- ముఖ్య సలహాదారు: చిలుముల రమేష్

నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల ప్రచారం, విద్యాభివృద్ధి, సామాజిక సమానత్వం, రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత నిస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొంకూరి రవీందర్, అడ్డూరి రమేష్, అడ్డూరి ప్రశాంత్, చిలుముల వినోద్‌తో పాటు గ్రామానికి చెందిన జర్నలిస్టులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులు పేరుకేనా?

- పెత్తనం భర్తలదైతే.. పదవులు భార్యలకెందుకు?

నిత్యం నిఘా స్పెషల్ స్టోరీ:మహిళలకు రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించి, నాయకత్వంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తోంది. అయితే కొన్ని గ్రామాల్లో మహిళలు సర్పంచులుగా ఎన్నికైనా, పాలనాపరమైన వ్యవహారాల్లో వారి భర్తలే కీలకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సమస్యల పరిష్కారం నుంచి పోలీస్‌స్టేషన్లలో పంచాయతీలు, వివాదాల పరిష్కారాల వరకు భర్తలే ముందుండి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మహిళల రాజకీయ స్వతంత్ర తపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

పదవి భార్యదా.. అధికారం భర్తదా?

ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్నది మహిళా సర్పంచును. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, అధికారులతో సమన్వయం వంటి బాధ్యతలను ఆమె స్వయంగా నిర్వహించాలి. కానీ అన్ని వ్యవహారాల్లో భర్తలే ముందుండి నిర్ణయాలు తీసుకుంటే మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన అసలు లక్ష్యం నెరవేరుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన మహిళకు బదులుగా ఆమె భర్తే అధికారిక వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తే, ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతినే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

మహిళలకు అవకాశం ఇచ్చి.. అధికారం మరొకరికి అప్పగిస్తారా?

మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం అంటే కేవలం పదవులను కేటాయించడం మాత్రమే కాదు.. వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించడం కూడా. మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే పెత్తనం చెలాయిస్తే, రాజకీయాల్లో మహిళల సాధికారతకు అర్థం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహిళలకు కేటాయించిన పదవుల్లో వారే బాధ్యతలు నిర్వహించాల్సినప్పుడు, వారి పేరుతో మరొకరు అధికారాన్ని చెలాయించడం ఎంతవరకు సమంజసమనే చర్చ జరుగుతోంది. అయితే మహిళా సర్పంచులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లకూడదనే సాధారణ నిబంధన లేదు. చట్టపరమైన బాధ్యతలు, అధికార పరిధికి లోబడి వారు పోలీసులను సంప్రదించవచ్చు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చు. సమస్య మహిళా సర్పంచులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లడంలో కాదు.. ఎన్నికైన ప్రజాప్రతినిధుల అధికారాలను మరొకరు వినియోగిస్తున్నారనే ఆరోపణల్లో ఉంది.



అధికారుల పర్యవేక్షణ అవసరం

మహిళా సర్పంచులు తమ అధికారాలను స్వయంగా వినియోగిస్తూ, గ్రామ పాలనలో చురుకైన పాత్ర పోషించేలా సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలి. ప్రజాప్రతినిధుల అధికారాల దుర్వినియోగంపై ఫిర్యాదులు వస్తే నిబంధనల ప్రకారం పరిశీలించాలి. అదే సమయంలో మహిళా సర్పంచులపై అనవసర ఆరోపణలు చేయకుండా వాస్తవాల ఆధారంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం ఎంత ముఖ్యమో, ఆ అవకాశాలను వారు స్వతంత్రంగా వినియోగించుకునే వాతావరణం కల్పించడం కూడా అంతే ముఖ్యం. మహిళా సర్పంచులు పేరుకే పరిమితం కాకుండా గ్రామాభివృద్ధిలో తమదైన ముద్ర వేయాలి. రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరాలి.. మహిళా సాధికారత బలోపేతం కావాలి.. ప్రజాస్వామ్య విలువలు నిలవాలి!

మల్లూరు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అటవీ శాఖ సీసీఎఫ్

- ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికిన అర్చకులు



మంగపేట, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):కాలేశ్వరం జోన్ అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి (సీసీఎఫ్) ప్రభాకర్ సోమవారం మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో ఆయన పేరున ప్రత్యేక అర్చన నిర్వహించి, స్వామివారి విశిష్టతను వివరించారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందించి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను సమర్పించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
- **పెండింగ్ నోటీసుల విచారణను వేగవంతం చేయాలి..**
  రికార్డుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి





హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు, ఓటరు జాబితాకు సంబంధించిన భౌతిక, ఆన్‌లైన్ రికార్డులు, ఆధారాలను భద్రంగా నిర్వహించాలని సూచించారు.

సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పనులను మూడు నుంచి నాలుగు రోజుల్లో, వారాంతానికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం వంటి అంశాలకు సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను తప్పనిసరిగా భద్రపరచాలని స్పష్టం చేశారు. అనర్హమైనవిగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, సంబంధిత పత్రాలను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తుల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు వివరించారు. రాజకీయ పార్టీలు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు లేదా ఇతరులు ఆధారాలు కోరినప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నవంబర్ 5లోగా దరఖాస్తుల పరిష్కారం

ఫారం–6 దరఖాస్తుల పరిశీలనతోపాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఫారం–7కు సంబంధించిన పెండింగ్ పనులను కూడా అదే గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను క్రమబద్ధంగా భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఓటరు నమోదు అధికారులు, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని రికార్డులను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రంగా నిర్వహించాలని ఆదేశించారు. భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తినా, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వచ్చినా అవసరమైన సమాచారం, ఆధారాలను వెంటనే అందించేలా రికార్డుల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. అర్హుల పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపు నిబంధనల ప్రకారం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఫారం–18 ద్వారా ఇప్పటికే సుమారు 29 వేల దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. గతేడాది దాదాపు 45 వేల దరఖాస్తులు అందగా, ఈసారి కూడా దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. అందిన దరఖాస్తుల్లోని వివరాలు, అసలు ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు జగత్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో వరంగల్‌కు అవార్డు.. గర్వకారణం

- **పర్యావరణహిత పట్టణాభివృద్ధికి దక్కిన గుర్తింపు**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ వెంకన్న,**
  అధికారులకు కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అభినందనలు



హనుమకొండ, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ స్థాయిలో నాన్ మోటరైజ్డ్ రవాణా విభాగంలో వరంగల్ నగరానికి అవార్డు లభించడం గర్వకారణమని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. ఈ గుర్తింపు నగర ప్రతిష్ఠను మరింత పెంచిందని పేర్కొన్నారు. వరంగల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులను ఆమె అభినందించారు. సోమవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో వరంగల్ నగరానికి జాతీయ అవార్డు లభించిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయి, వెంకన్న, కుడా నగర ప్రణాళిక అధికారి అజిత్ రెడ్డి తదితరులను గుండు సుధారాణి సత్కరించి అభినందనలు తెలిపారు.

పర్యావరణహిత అభివృద్ధికి ప్రోత్సాహం

ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో శనివారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి పట్టణ సదస్సులో నాన్ మోటరైజ్డ్ రవాణా విభాగంలో వరంగల్ నగరానికి అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన పోటీలో వరంగల్‌తో పాటు చెన్నె నగరానికి ఈ గుర్తింపు దక్కడం విశేషమని పేర్కొన్నారు. వరంగల్ నగరానికి ఈ అవార్డు రావడం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థకు గర్వకారణమని తెలిపారు. నగర అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ జాతీయ గుర్తింపు వరంగల్‌లో పర్యావరణహిత పట్టణాభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా కార్యనిర్వాహక ఇంజినీర్ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భార్య హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం!

- **అక్రమ సంబంధంపై నిలదీయడంతో ఘాతుకం..**
  పోలీసుల విచారణలో వెలుగులోకి వాస్తవాలు
- **24 గంటల్లోనే కేసును ఛేదించిన పర్వతగిరి పోలీసులు..**
  నిందితుడు రిమాండ్‌కు



వరంగల్ / పర్వతగిరి,అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): అక్రమ సంబంధం విషయంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారితీసినట్లు పోలీసులు వెల్లడించారు. భార్యను హతమార్చిన అనంతరం ఆ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భర్త ప్రయత్నించినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మాల్యాతండా పరిధిలోని హర్జాతండాలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కేసు నమోదైన 24 గంటల్లోనే దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పదేళ్లుగా కొనసాగుతున్న సంబంధంపై వివాదం

పోలీసుల వివరాల ప్రకారం.. హర్జాతండాకు చెందిన పాల్తియ బాలు (63), ఆయన భార్య పాల్తియ పూలమ్మ (53) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, ముగ్గురికీ వివాహాలయ్యాయి. వారు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. బాలుకు గత పదేళ్లుగా మరో మహిళతో సంబంధం ఉన్నట్లు, ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దసరా పండుగకు ముందు ఉప్పలమ్మ కార్యక్రమం కోసం కుమారుడు నవీన్ తన తల్లి పూలమ్మను హర్జాతండాకు తీసుకొచ్చాడు.

నిలదీసిన భార్య.. గొంతు నులిమిన భర్త

ఈ నెల 24న మరో మహిళతో సంబంధం విషయమై పూలమ్మ భర్తను నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు పోలీసుల కథనం. ఈ క్రమంలో బాలు భార్య గొంతు నులిమి, టవల్‌తో మెడకు బిగించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. పూలమ్మ స్పృహ కోల్పోవడంతో ఆమె మరణించిందని భావించిన బాలు, ఘటనను ప్రమాదంగా చూపించాలని పథకం వేసుకున్నట్లు తెలిపారు.

మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి ప్రమాద నాటకం

తండా పరిసరాల్లో గ్రామస్థులు అంత్యక్రియల కార్యక్రమానికి వెళ్లిన సమయంలో నిందితుడు తన పథకాన్ని అమలు చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వివరించారు. తన అంగీపై ఉన్న రక్తపు మరకలు కనిపించకుండా దుస్తులను, టవల్‌ను ఒక కవరులో పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం తన స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్ (నంబరు TS-24-B-3600)పై భార్యను ముందు కూర్చోబెట్టుకుని, సుమారు కిలోమీటరు దూరంలోని లాల్‌తండా సమీపంలో బోడ దేవాల అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అక్కడ బైక్‌ను రోడ్డుపై పడేసి ప్రమాదం జరిగినట్లు కనిపించేలా ప్రయత్నించినట్లు తెలిపారు.

అయితే పూలమ్మలో కదలికలు కనిపించడంతో ఆమె ఇంకా ప్రాణాలతో ఉందని భావించిన బాలు, మరోసారి గొంతు నులిమి, ఆమె తలను రోడ్డుకు కొట్టినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు.

తనపైనా దాడి జరిగినట్లు నమ్మించే ప్రయత్నం

హత్యపై అనుమానాలు రాకుండా ఉండేందుకు బాలు తన కుడి కంటి కింద రాయితో గాయం చేసుకుని, ఆ రాయిని సమీపంలోని చెట్లలోకి విసిరేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఘటనను రోడ్డు ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ, పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

చింతనెక్కొండ వద్ద నిందితుడి పట్టివేత

కేసును దర్యాప్తు చేసిన పర్వతగిరి పోలీసులు నిందితుడు పాల్తియ బాలును చింతనెక్కొండ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపాలి!

- **బాధితులకు న్యాయం.. అసాంఘిక శక్తులకు చెక్ పెట్టాలి!**
- **వర్ధన్నపేట నూతన ఎస్‌హెచ్‌ఓ కు కాంగ్రెస్ నేతల స్పష్టమైన విజ్ఞప్తి**



వరంగల్/ వర్ధన్నపేట,అక్టోబర్ 26(నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని, బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేసి ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన ఎస్‌హెచ్‌ఓ భోగం ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన భోగం ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొనే ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

బహిరంగ మద్యపానంపై కఠిన నిఘా ఉండాల్సిందే!

పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల మహిళలు, విద్యార్థులు, యువత ఎదుర్కొనే ఇబ్బందులను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

బాధితుల ఫిర్యాదులకు నిర్లక్ష్యం వద్దు!

న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను ఓపికగా విని, వారి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో సత్వర చర్యలు తీసుకోవాలని నేతలు విజ్ఞప్తి చేశారు. బాధితులకు పోలీస్ స్టేషన్‌లో గౌరవప్రదమైన స్పందన లభించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను నియంత్రించడం, పట్టణంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడం పోలీసుల ప్రధాన బాధ్యతలని వారు గుర్తుచేశారు. నూతన ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, ఐత సుధాకర్, సోహైల్, పులి శ్రీనివాస్, తోటకూరి శ్రీనివాస్, కొండేటి సుధాకర్, విలసారపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- భూపాలపల్లిలో పోలీసుల బైక్ ర్యాలీ
- అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించడమే నిజమైన నివాళి



భూపాలపల్లి, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ నరేష్ కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం భూపాలపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని అదనపు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి జయశంకర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది.

అమరవీరుల త్యాగాలు పోలీసులకు స్ఫూర్తి

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. అమరవీరుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం అమరవీరులు చేసిన ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేసుకోవడంతోపాటు, దేశ సేవకు, ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలనే స్ఫూర్తిని అందిస్తాయని అన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రత్నం, సంతోష్, ఎస్ఐలు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, ప్రత్యేక పోలీస్ బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై బీజేపీ ప్రత్యేక దృష్టి

వరంగల్, అక్టోబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కో-ఇంచార్జ్ డా. వన్నాల వెంకటరమణ సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇప్పటివరకు నమోదైన పట్టభద్రుల వివరాలు, నమోదు పురోగతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్పించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.



అర్హులైన ప్రతి పట్టభద్రుడి నమోదు లక్ష్యం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమని పేర్కొన్న డా. వన్నాల వెంకటరమణ, అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ప్రాంతంలో పట్టభద్రులను నేరుగా సంప్రదించి, అవసరమైన వివరాలు సేకరించి, నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పత్రాలపై అవగాహన.. నమోదులో కచ్చితత్వం

ఓటరు నమోదుకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన పత్రాలపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్రోల్మెంట్ కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రులందరికీ ఓటరు నమోదు ప్రక్రియపై సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు ఎన్రోల్మెంట్ జిల్లా కో-కన్వీనర్ త్రిలోకేశ్వర్ రావు, వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్/ఇన్చార్జ్ మైస రాము, బీజేపీ మండల అధ్యక్షుడు అడుపరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు ఎన్రోల్మెంట్ మండల కన్వీనర్/ఇన్చార్జ్ మణిదీప్, మండల కో-కన్వీనర్ వేల్పుల కార్తీక్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కర్క సోమిరెడ్డి, సీనియర్ నాయకుడు బోయినపల్లి దేవేందర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాముల సంపత్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ పాషా,నరహరి గార్ల ఆశయాలు సాధిస్తాం



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26 : సోమవారం మంచాల మండల కేంద్రంలో కామ్రేడ్ మహబూబ్ పాషా, కామ్రేడ్ నరహరి గార్ల ఆశయాలు సాధించాలని సిపిఎం మంచాల మండల కార్యదర్శివర్గ సభ్యులు మార బుగ్గ రాములు, మండల కమిటీ సభ్యులు పుల్లగల్ల గోపాల్ అన్నారు.37 వ వర్ధంతి సందర్భంగా ఆరుట్ల గ్రామం లో జరిగిన కార్యక్రమంలో అమరవీరుల స్తూపానికి మరియు ఫొటోలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకులను ఆరోజు కాంగ్రెస్, బీజేపీ గుండాలు దారి కాచి చంపారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదల సమస్యలు తీరడం లేదని, భూసమస్యలు, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడం లో బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కానీ పూర్తిగా విఫలం అయ్యాయని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు చేయడంతోనే వారి ఆశయాలు సాధిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో శాఖ కార్యదర్శులు కొండిగారి బుచ్చయ్య, బోయపల్లి అంజయ్య, చిందం బీరప్ప, నక్క మల్లేష్ మాజీ కో అప్షన్ సభ్యులు యూసఫ్ అలీ, కొండిగారి శంకరయ్య, బడ్డు విజయ్, జోగు శేఖర్, సాతిరి సత్తయ్య, అనుపాటి గణేష్, ఎర్పుల వీరేష్, సాతిరి నర్సింగ్ రావు,కొండిగారి ప్రసాద్, ఎండీ జావీద్, ఆర్ల వెంకటేష్, అలవాల భాస్కర్, ఎండీ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం



నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 26 : వికారాబాద్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారితో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన 94 దరఖాస్తులను స్వీకరించారు.ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యమివ్వాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మహిళా కండక్టర్ పై దాడిని ఖండించండి

- ఎంప్లాయిస్ యూనియన్ ఇబ్రహీంపట్నం డిపో అధ్యక్ష కార్యదర్శులు జిల్లా జంగయ్య సిహెచ్ పరమేష్.
- బస్సులోంచి కండక్టర్ ను నెట్టేసిన మహిళ మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికురాలు



నిత్యం నిఘా, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26 : ఇబ్రహీంపట్నం కేంద్రంలో డిపో ముందు నిరసన తెలియజేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ ఇబ్రహీంపట్నం డిపో అధ్యక్షుడు జిల్లా జంగయ్య మాట్లాడుతూ,మహిళా కండక్టర్ పై విధి నిర్వహణలో జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం జరిగినటువంటి ప్రవళిక పై తోటి మహిళా ప్యాసింజరు ఆన్ డ్యూటీ లో ఉన్నటువంటి మహిళా కండక్టర్ పై అమానుషంగా దాడి చేసినటువంటి ఆ యొక్క మహిళా ప్రవర్తనను తీవ్రంగా ఇబ్రహీంపట్నం డిపో ఎంప్లాయిస్ యూనియన్ టీఎంయూ టీజేఎంయు ఫక్షన ఖండిస్తున్నాము ఇటు ప్రభుత్వం గానీ ఇటు మేనేజ్మెంట్ యాజమాన్యం గాని మహిళా కండక్టర్ పై జరిగినటువంటి దాడి విషయంలో కఠినమైనటువంటి సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యేవిధంగా యాజమాన్యం కూడా చొరవ చూపాలని ఇబ్రహీంపట్నం డిపో పక్షాన రాష్ట్ర కమిటీ ఏదైతే నిర్ణయం తీసుకుంటుందో దానికి మేం కట్టుబడి ముందు ముందు కార్యచరణలో పాల్గొంటామని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాం ఇట్టి కార్యక్రమములోఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అడ్వైజర్ బి అశోక్ జోన్స్ వైస్ ప్రెసిడెంట్ చింతకింది యాదగిరి ముదిరాజ్, డిపో అధ్యక్షులు జిల్లా జంగయ్య సెక్రటరీ సిహెచ్ పరమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ డి,వెంకటేష్, చిట్టే రమేష్ కృష్ణ ఈట శేఖర్టీఎంయూ హైదరాబాద్ రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జే వెంకటేష్ టీజేఎంయు ప్రెసిడెంట్



అబ్దుల్ రజాక్ ,సురేష్,మహిళా కండక్టర్లు సునీత, సుగంధ, మంజుల,లలిత యాదమ్మ,కల్పన,ఇబ్రహీంపట్నం డిపో తరపున నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. డిపో కండక్టర్లు డ్రైవర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురునానక్ మందిర్ కమాన్ ల నిర్మాణానికి భూమిపూజ చేసిన జగ్గారెడ్డి

- సంగారెడ్డి పట్టణం లోని గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డి

నిత్యం నిఘా, సంగారెడ్డి, అక్టోబర్ 26 :
గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.అంతకుముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com